క్లుప్తంగా

కాలభైరవుడికి అష్టమి పూజలు



కాలభైరవుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాయచోటి టౌన్ : శ్రీ కాలభైరవుడికి అష్టమి పూజలు విశేషంగా నిర్వహించారు. రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని శ్రీ కాలభైరవుడి ఆలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అంతకుముందుగా వినాయకుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు



రామాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సీపీఓ సుదర్శన్‌రెడ్డి

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయం ప్రాంగణంలోని రామాలయంలోని ధ్వజస్తంభానికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం స్థాపించి 40 రోజులు పూర్తి అయిన సందర్భంగా హోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీతారాముల విగ్రహాలకు ఊరేగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సీపీఓ సుదర్శన్ రెడ్డి దంపతులు రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

నిందలు వేయడం తగదు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష

రాయచోటి అర్బన్ : గతాన్ని మరచిపోయి తనపై నిందలు వేయడం తగదని మాజీ మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు సలావుద్దీన్‌కు మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష సూచించారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'సలావుద్దీన్ నా రాజకీయ ప్రత్యర్థులను పక్కన కూర్చోపెట్టుకుని ఆరోపణలు చేస్తున్నాడు. ఎవరు ఎలాంటి వారో రాయచోటి పట్టణ ప్రజలకు బాగా తెలుసు. మైనార్టీలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిపై కూడా సలావుద్దీన్ ఆరోపణలు చేయడం తగదు. పసలేని ఆరోపణలు చేయడం మంచిది కాదు' అని హితవుపలికారు.

వైఎస్సార్‌సీపీ యూత్ ప్రధాన కార్యదర్శిగా న్యామతుల్లా



రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శిగా షేక్ కరమల న్యామతుల్లాను జిల్లా ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ అష్రఫ్ అలీని వేర్వేరుగా ఎంపిక చేస్తూ శనివారం ఆదేశాలు జారీ చేశారు. రాయచోటి పట్టణంలో వైఎస్సార్ సీపీకి కొలిమి కుటుంబం ఎంతో సేవ చేసిందని వారి సేవను గుర్తించి ఈ పదవిని అప్పగిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అధిష్టానం నిర్ణయం మేరకు ఎంపీ మిధున్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా షేక్ కరమల న్యామతుల్లా ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

వాటర్ కూలర్ల వితరణ



వాటర్ కూలర్ అందజేస్తున్న షేక్ కలీల్ బాష

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ, కొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ కలీల్ బాష మండల కేంద్రంలోని హైస్కూళ్లు, ప్రభుత్వ కార్యాలయాలకు ఎనిమిది వాటర్ కూలర్లు, వాటర్ క్యాన్‌లను శనివారం సాయంత్రం అందించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, పాఠశాలలకు వచ్చే విద్యార్థులు చల్లని పానియాలు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ వాటర్ కూలర్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, స్టేట్ బ్యాంక్, పెనగలూరు హైస్కూల్, మోడల్ స్కూల్‌కు కూలర్లు అందజేసినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎస్‌బీఐ ఉద్యోగి, వెంకటస్వామి పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి

మదనపల్లె సిటీ : ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని తిరుపతి ఐఐటీ మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం .రవిశంకర్ పేర్కొన్నారు. స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో ఐఐటీ ప్రొఫెసర్లచే డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నొవేషన్ అంశంపై సెమినార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 3 డి ప్రింటింగ్ మిషన్ల ద్వారా అభివృద్ధి చేయబడిన బయో ఇంప్లాంట్స్ కేస్ స్టడీస్ గురించి వివరించారన్నారు.

విద్యారంగంలో కొత్తపుంతలు

- విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేసిన సీఎం జగన్
- ప్రజారోగ్యం ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : విప్లవాత్మక మార్పులతో రాష్ట్రంలో విద్యారంగాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కొత్తపుంతలు తొక్కించారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కొనియాడారు. శనివారం మండలంలోని నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ1.60 కోట్ల నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదుల ప్రారంభానికి విచ్చేసిన ఆయనకు గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం, స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థులతో శ్రీకాంత్‌రెడ్డి మమేకమయ్యారు. డిజిటల్ తరగతుల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. స్మార్ట్ టీవిలు, ఐఎఫ్‌పీల ద్వారా పాఠ్యాంశాల బోధన విజయవంతంగా సాగుతోందన్నారు. దీంతో విద్యార్థుల్లో పఠనాశక్తి పెరుగుతోందని, సర్కారు బడుల్లో డిజిటల్ కాంతులు ఇంద్రధనస్సులై శోభిల్లుతున్నాయని తెలిపారు. తరగతి గదుల్లో చదువుల జాతరకు తెరతీస్తూ బంగారు భవితకు బాటలు వేస్తున్నాయని ప్రశంసించారు. డిజిటల్ బోధనలో ఉపాధ్యాయుల పని సులువైందన్నారు. స్క్రీన్‌పై చూపించి చెప్పడంతో విద్యార్థులు వెంటనే అర్థం చేసుకుంటున్నారన్నారు. ఇది గొప్ప విప్లవాత్మక మార్పు, స్మార్ట్ టీవిల ద్వారా బోధించడంతో పాఠశాలు బాగా అర్థమవుతున్నాయన్నారు.

విద్యా పథకాలకు రూ.73 వేల కోట్లు

అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రాథమిక స్థాయి నుంచే ఉన్నత చదువుల వరకు విద్యా రంగంలో పెను మార్పులకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారని తెలిపారు. 57 నెలల కాలంలో వివిధ విద్యా పథకాలకు రూ.73 వేల కోట్లు ఖర్చు పెట్టడం ఒక చరిత్ర అన్నారు. రూ.12 వేల కోట్ల నిధులతో నాడు -నేడుతో పాఠశాలలను జగన్ ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. పేద విద్యార్థులు కూడా ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంతో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే విద్యార్థులకు క్రమం తప్పకుండా విద్యా దీవెన పథకం ద్వారా నగదు జమ చేస్తున్నారని తెలిపారు. ఏ ఒక్కరూ చదువులకు దూరం కాకూడదనే ఉద్దేశంతో సీఎం జగన్ అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ రాఘవరెడ్డి, డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీలు రవిశంకర్‌రెడ్డి, బాబు, సర్పంచ్ అంజూమ్ సుల్తానా, ఆయూబ్, మాజీ ఎంపీపీ నస్రీన్ సుల్తానా, సింగల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు అబ్దుల్ హుస్సేన్, జహరుద్దీన్, ఖతిబ్ బేగ్, మాజీ ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, సర్పంచ్‌లు నాగభూషణరెడ్డి, వెంకటరెడ్డి, రఘురామయ్య, శివ, రామాంజులు, మునీర్, మాజీ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ హరినాథరెడ్డి, నాయకులు రషీద్, సహదేవరెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ మురళీరెడ్డి, దర్బారు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు శివశంకర్, శ్రీను, యువజన విభాగం వెంకటసుబ్బారెడ్డి, నాగేంద్రరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ ఇంతియాజ్, రియాజ్, జాఫర్, సిరాజ్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లె చెంతకే ప్రజా వైద్యం

రామాపురం : పల్లెల చెంతకే వైద్యాన్ని సీఎం జగన్ తీసుకువచ్చారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నీలకంఠ్రావుపేటలో విలేజ్ క్లినిక్ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు గ్రామంలోనే వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రతి 2,500 జనాభాకు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లను నియమించడం జరిగిందన్నారు. 12 రకాల వైద్య సేవలు అందించడంతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అలాగే 65 రకాల మందులు, 67 రకాల బేసిక్ మెడికల్ ఎక్విప్‌మెంట్‌లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇంటివద్దకే నాణ్యమైన వైద్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

చల్లగా చూడు తల్లీ

మండలంలోని గోపగుడిపల్లె గ్రామం కాంపల్లె హరిజనవాడలో జరిగిన మాతమ్మ విగ్రహ ప్రతిష్టలో ముఖ్య అతిథిగా శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీ మాతమ్మ తల్లి ప్రజలందరినీ చల్లంగా చూడు తల్లీ అంటూ ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి, రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ సుబ్బయ్య, రఘురామయ్య, శివయ్య, ఉప సర్పంచ్‌లు శివయ్య, బాబు, నాయకులు, మల్లయ్య, సుబ్బయ్య, శివయ్య, రెడ్డయ్య, శివరామకృష్ణ, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే పూజలు

రాయచోటి అర్బన్ : పట్టణంలోని బండ్లపెంటలో వెలసిన శ్రీ హజరత్ సయ్యద్ యూసుఫ్ ఖాదరి దర్గా ఉరుసు సందర్భంగా మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాష, ఫయాజుర్ రహిమాన్ ముస్లింలతో కలిసి దర్గాలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ప్రార్థనలు చేసి చాదర్ సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేతలు మహమ్మద్‌ఖాన్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు తబ్రేజ్‌ఖాన్, రాయాజుర్ రహిమాన్, కొలిమి హారూన్‌బాష, ఆసిఫ్‌అలీఖాన్, జాకీర్, అల్తాఫ్, రౌనఖ్, కొలిమి చాన్‌బాష, ఫయాజ్ అహమ్మద్, సాదక్‌అలీ, రియాజ్, విజయభాస్కర్, సుగవాసి ఈశ్వర్, జీఎండి ఆర్షాద్, గువ్వల బుజ్జిబాబు, విక్కీదేవేంద్ర, కొత్తపల్లె ఇంతియాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి కృషి

రాయచోటి : గిరిజన సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సంబేపల్లె మండలం పెద్దబిడికికి చెందిన వైఎస్సార్‌సీపీ గిరిజన నాయకుడు మహేంద్ర నాయక్ రూపొందించిన ఎన్నికల ప్రచార పోస్టర్‌ను డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాజి వెంకటేశ్వర్లు తదితర నాయకులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, లక్ష్మీకర్ రెడ్డి, శ్రీను నాయక్, ఫయాజ్, అహ్మద్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

సంబేపల్లె : సంబేపల్లె మండలం దేవపట్లలో సుబ్రమణ్యం నాయక్ ఏర్పాటు చేసిన రీతూ డ్రైవింగ్ స్కూల్‌ను డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఆవుల మల్లికార్జునరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. డ్రైవింగ్‌లో ఉత్తమ శిక్షణ, మెళుకవలు నేర్పించి ఉత్తమ డ్రైవర్లుగా తీర్చిదిద్దాలని శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తిక్కం ఆనందరెడ్డి, జిలాన్, వలి తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్స్ పోలియో



పోలియో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

నందలూరు (రాజంపేట) : నందలూరు మండలాన్ని పోలియో రహిత మండలంగా తీర్చిదిద్దాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శరత్ కమల్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు ఆదివారం పోలియో చుక్కలు వేయాలని సూచించారు. మండలంలో 48 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఐదు రూట్లలో ఐదు మంది రూట్ సూపర్ వైజర్లను వాహనాలు ద్వారా ఉదయం 6.30 గంటలకు పల్స్ పోలియో కేంద్రాలకు వ్యాక్సిన్, పరికరాలు చేర్చేందుకు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 7 గంటలకే పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సిబ్బందికి ఆదేశించారు. కేంద్రాలకు రాని పిల్లలకు నాలుగు, ఐదు తేదీల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, విశ్వనాథ్, సీహెచ్‌ఓ వెంకటనారాయణ పాల్గొన్నారు.

రామాపురం : పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రాథమిక వైద్యాధికారి వినోద్‌కుమార్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో 47 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆదివారం పిల్లలకు పోలియో చుక్కలు వేసి భవిష్యత్తులో అంగవైకల్యం రాకుండా కాపాడాలన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

కలకడ : కలకడలోని కామాక్షి సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శనివారం అంకురార్పణ చేసినట్లు ఆలయ ధర్మకర్త అఖిలేష్ తెలిపారు. ఈ నెల 13వతేదీ వరకూ ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వ్యూహం సినిమాను వీక్షించిన కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని లక్ష్మీప్యారడైజ్ సినిమా హాల్‌లో ప్రదర్శిస్తున్న వ్యూహం సినిమాను శనివారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలతో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యూహం సినిమాను చూస్తున్నంతసేపు గతంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పడిన కష్టాలు గుర్తుకొస్తున్నాయన్నారు. కళ్లకు గట్టినట్టు వైఎస్ జగన్ జీవిత చరిత్ర చూపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయసలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, జెడ్పీటీసి రత్నమ్మ, ఉప సర్పంచ్ తోట శివసాయి, గునిశెట్టి రమేష్, సిహెచ్.రమేష్, హరికృష్ణారెడ్డి, బండారు మల్లి, మహేశ్వర్‌రెడ్డి, రాఫ్, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో బర్డ్ ఫ్లూ నియంత్రణ



వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ రాజశేఖర్

చిట్వేలి : రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, ఫారెస్టు శాఖల సమన్వయంతో బర్డ్ ఫ్లూ వ్యాధిని నివారించవచ్చని ఉమ్మడి కడప జిల్లా పశువ్యాధుల నిర్ధారణ సహాయ సంచాలకులు, నియంత్రణ నోడల్ అధికారి డాక్టర్ రాజశేఖర్ అన్నారు. శనివారం నెల్లూరు, అన్నమయ్య జిల్లాల సరిహద్దులో అనుంపల్లి వద్దగల ఫారెస్టు, పోలీస్ చెక్ పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిమాంసం, కోడిగుడ్లను బాగా ఉడికించి తినాలని ప్రజలకు సూచించారు. కోళ్ల వ్యాపారులు, కోళ్లఫారాల యజమానులు, గ్రామీణ కోళ్ల పెంపకం దారులు మూడు నెలల పాటు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులను అభినందిస్తున్న జడ్జి

నందలూరు (రాజంపేట) : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె. లత అన్నారు. శనివారం నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మహిళా దినోత్సవం సందర్భంగా ముందస్తుగా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి మహిళ చదువుకోవాలని, చదువుకోవడం వారి ప్రాథమిక హక్కు అని తెలిపారు. మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించగలరని తెలియజేశారు. మహిళలు తనలోని బలాలను, బలహీనతలను తెలుసుకొని పొగడ్తలకు పొంగిపోకుండా, విమర్శలకు కృంగిపోకుండా, జీవితంలో అనుకున్నది సాధించాలన్నారు. పోష్ యాక్ట్ పని చేసే చోట ప్రతి మహిళకు అండగా నిలుస్తుందని, ఈ చట్టం ప్రతి మహిళకు వర్తిస్తుందని తెలిపారు. మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపులకు గురిచేస్తే అది మానవ హక్కుల ఉల్లంఘన అని తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కోర్టు మహిళా సిబ్బందిని, మహిళా న్యాయవాదులను, పంచాయతీ మహిళా సిబ్బందిని న్యాయమూర్తి కె. లతను సత్కరించారు. అలాగే గొబ్బిళ్ల స్కూల్‌లో ఇటీవల జాతీయ స్థాయిలో బెంగుళూరులో నిర్వహించిన ఎస్ఎస్ఐసీ 2023–24 పోటీలలో బంగారు పతకాలు, క్యాష్ రివార్డ్స్ సాధించిన గొబ్బిళ్ల అక్షర స్కూల్ విద్యార్థులు అఫ్రిన్, ఆర్షియా, తస్లీమ్‌లను జడ్జి లత సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దాసరి నరసింహులు, ఏవీ సుబ్రమణ్యం, ఎస్ మహమ్మద్ అలీ, హెచ్ ఆనంద్ కుమార్, షమీవుల్లా ఖాన్, జి సుబ్బరామయ్య, అనుదీప్, మహిళా న్యాయవాదులు శోభారాణి, అంబికా, మీనా, సుప్రజ, నీలిమ, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ వసుంధర, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రెగ్యులర్‌లాగే ఓపెన్ స్కూల్ పరీక్షలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ రాఘవరెడ్డి

రాయచోటి టౌన్ : 10వ తరగతి రెగ్యులర్ విద్యార్థుల పరీక్షల నిర్వహించినట్లుగానే ఓపెన్ స్కూల్ 10వ తరగతి పరీక్షలు నిర్వహించాలని ఆర్‌జేడీ యద్దుల రాఘవరెడ్డి అధికారులకు సూచించారు. ఇంటర్ పరీక్షల పర్యవేక్షణలో భాగంగా శనివారం రాయచోటి డైట్ కేంద్రంలో పదవతరగతి పరీక్షల నిర్వహణ, ఓపెన్‌స్కూల్ 10వ తరగతి పరీక్షల నిర్వహణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం రెగ్యులర్ 10వ తరగతి విద్యార్థుల పరీక్షల నిర్వహిస్తామని, అలాగే మధ్యాహ్నం 2–30 గంటల నుంచి ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని అందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అనంతరం డీఈఓ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ కోసం కేటాయించిన కేంద్రాలలో కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై మరోసారి సరి చూసుకోవాలని చెప్పారు. అనంతరం ఓపెన్ స్కూల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ అక్బర్ ఆలీ మాట్లాడుతూ విద్యార్థులకు హాల్ టిక్కెట్‌లో ఏ సబ్జక్టు ఉంటుందో అదే జారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో ఆరో తరగతికి ప్రవేశాలు

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్ : జిల్లా వ్యాప్తంగా ఏపీ మోడల్ స్కూళ్లలో 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ శివప్రకాష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు చదువుకోవడానిక ఎలాంటి పరీక్షల ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కేవలం ప్రవేశ పరీక్షల కోసం ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 150, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ. 75 చెల్లించాలన్నారు. ఏప్రిల్ 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మండలాల్లోని మోడల్ స్కూళ్లలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులకు 5వ తరగతి స్థాయి సిలబస్‌తోనే ఆంగ్లమాధ్యమంలో ప్రవేశ పరీక్షలు ఉంటాయని తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ పాఠశాలలో 2024–2025 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి విద్యార్థుల ప్రవేశానికి ఏప్రిల్ 21వ తేదీ ఆదివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఓబీసీ కులాలకు చెందిన విద్యార్థులు 2012, సెప్టెంబర్ 1వ తేది, 2014 ఆగస్టు 31వ తేదీ మధ్య పుట్టి ఉండాలని, ఎలాగే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 సెప్టెంబర్ 1, 2014 ఆగస్టు 31వ తేది మధ్య పుట్టి ఉండాలన్నారు. సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2022– 2024 మధ్య కాలంలో నిరవధికంగా చదివిన వారై ఉండాలని పేర్కొన్నారు. సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి ఈ నెల 3 నుంచి 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సహజబ్లెస్సీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతి పరీక్షకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఏదైనా గుర్తింపు పొందిన పాఠశాలలో 2022–23, 2023–24 విద్యా సంవత్సరాలలో క్రమంగా చదివి ఉండాలని ఆమె తెలిపారు. విద్యార్థులు ఐదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ శనివారం తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ. 150లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. 75 లు ఆన్‌లైన్‌లో ఈనెల 31వ తేదిలోపు ఆన్‌లైన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

రామాపురం : ఏపీ మోడల్ స్కూళ్లలో 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్ఎండీ అప్రోచ్‌బేగం శనివారం తెలిపారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 21న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు ఉంటుందని, ప్రవేశ పరీక్ష కోసం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ150లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చెల్లించాలన్నారు.

ఆర్థిక సాయం

పుల్లంపేట: పుల్లంపేట మండలంలోని శ్రీరాముల పేటకు చెందిన లతశ్రీ (2) అనే బాలిక దీర్ఘకాల వ్యాధితో బాధపడుతుండగా పుల్లంపేటకు చెందిన స్పందన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పుల్లంపేట ఎస్ఐ రఘురాం చేతుల మీదుగా రూ.30 వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే మనోజ్, ఈశ్వర్ కూడా తమవంతు సహాయం అందజేశారు. బాలిక తల్లిదండ్రులు ఆర్థిక సహాయం అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

సకాలంలో పన్ను చెల్లించండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాంబాబు

రాజంపేట : రాజంపేట పట్టణవాసులు మున్సిపాలిటికి చెల్లించాల్సిన పన్నులు సకాలంలో చెల్లిస్తే అపరాధరుసం ఉండదని రాజంపేట మున్సిపల్ కమిషనర్ రాంబాబు అన్నారు. శనివారం తన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆస్తి పను, ఖాళీ స్థలం పన్ను, నీటి పన్నుల చెల్లింపుదారులకు పన్నుల బకాయిలను ఏకమొత్తంగా 2023–2024 రెండవ అర్ధ సంవత్సరం వరకు పూర్తి చెల్లిస్తే అపరాధ రుసం ఉండదన్నారు. వడ్డీలేకుండా ప్రభుత్వం పన్నులను చెల్లించేందుకు ప్రభుత్వం జీఓ జారీ చేసిందని తెలిపారు. పట్టణవాసులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపాలిటికి అన్ని విధాలుగా సహకరించాలని కోరారు.

రేపు మెగా జాబ్‌మేళా

పీలేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ డిగ్రీ, పీజీ అర్హత కల్గిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చునని తెలిపారు. పేటీఎం, బిగ్‌సి, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, యంగ్ ఇండియా, టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9493212454, 9441900909 లో సంప్రదించాలన్నారు.

సైన్స్‌తో సమాజాభివృద్ధి



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అధ్యాపకులు

సిద్దవటం : శాస్త్ర, సాంకేతిక విద్య ద్వారా సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని సిద్దవటం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీరాములు, పరమాత్మా సేవా వృద్ధాశ్రమ నిర్వాహకులు మలిశెట్టి వెంకటరమణ, రేంజర్ కళావతి, ఎస్బీఐ మేనేజర్ రమేష్‌బాబు అన్నారు. స్థానిక శ్రీ నలంద హైస్కూల్‌లో విద్య–వైజ్ఞానిక సంబరాల్లో భాగంగా శనివారం విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో మేధా సంపత్తిని పెంపొందించేందుకు విద్య– వైజ్ఞానిక సంబరాలు ఎంతగానో దోహద పడతాయని పేర్కొన్నారు. అంతేకాకుండా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పి. కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు మహబూబ్‌బాష, అమర్‌నాథ్, విద్యార్థులు, వెంకటేశ్వరపురం ఎంపీయూపీ స్కూల్ హెచ్ఎం రామశేషవులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వెంకటసుబ్బయ్య, డైరెక్టర్ పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి సైజున్నీషా

లక్కిరెడ్డిపల్లి : విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని లక్కిరెడ్డిపల్లి సివిల్ జడ్జి సైజున్నీషా పేర్కొన్నారు. శనివారం ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు.. మెనూ ప్రకారం భోజనం అందరికీ అందిస్తున్నారా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ 2024 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయని, కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యకు పేద, దనిక తేడా లేదని, ఎంత కష్టపడి చదివితే అంత మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. బాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోమటి రెడ్డి శివశంకర్ రెడ్డి, న్యాయవాది సిద్దయ్య, వార్డన్ పెద్దక్క, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో బహిరంగ వేలంపాటలు వాయిదా

మదనపల్లె : మున్సిపాలిటీకి చెందిన దినసరి మార్కెట్, వారపుసంత, జంతువధశాల, మాంసం మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్‌లో గేట్(అశీలు) వసూలు చేసుకునేందుకు కమిషనర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన బహిరంగ వేలంపాటలు రద్దయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు వేలంపాటలు నిర్వహించారు. దినసరి మార్కెట్, వారపు సంతకు...శిరీషా, సత్తార్ పేర్లతో ఇద్దరు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. దినసరి సంతకు సంబంధించి గత ఏడాది యస్.యాస్మిన్ రూ.1.30 కోట్లకు పాడుకోగా, , ఈ ఏడాది గత మూడేళ్ల సరాసరిని లెక్కించి, రూ.1కోటి9లక్షల17వేలుగా సర్కారు ధర నిర్ణయించి, వేలంపాట ప్రారంభించారు. దీనికి జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. అయితే పాటదారులు జీఎస్టీని మినహాయించి, వేలం ధర తగ్గిస్తే పాట పాడుకునేందుకు తాము సిద్ధమని చెప్పారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వివాహ రిసెప్షన్‌లో పాల్గొన్న కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి సోదరుడు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి కుమారుడు, ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకట్‌రెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు శనివారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, కడప జిల్లా వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కె సురేష్‌బాబులు హాజరయ్యారు. తిరుపతి పట్టణంలో వివాహ రిసెప్షన్ జరిగింది. వధూవరులను పెద్దలు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయి కిషోర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ వెంకటరమణ, మాజీ సింగల్ విండో అధ్యక్షులు కృష్ణారెడ్డి, మంగంపేట ఉప సర్పంచ్ కొలూరు మధుసూదన్ రెడ్డి, డీఆర్‌సీసీయూ మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి, పట్టణ కన్వీనర్ సిహెచ్ రమేష్, మంగంపేట ఏపీఎండీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.